క్లుప్తంగా

20 నుంచి ఈశ్వరమ్మ తల్లి జాతర ఉత్సవాలు

పెదబయలు: మండలంలోని గోమంగిలో ఈ నెల 20, 21 తేదీల్లో ఈశ్వరమ్మ తల్లి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్టు గోమంగి ఉత్సవ కమిటీ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని, ఘటాల ఊరేగింపు, ఆదివారం అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు, థింసా, కోలాటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు పరుగు పోటీలు



రన్నింగ్ పోటీల్లో విద్యార్థులు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గ్రంథాలయాధికారి శెట్టి సునీత ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు బుధవారం రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు పిల్లలను పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులను ఆమె కోరారు.

ఘటాలు, సారె వితరణ



అమ్మవారి ఘటాలతో పాటు పుట్టింటి చీర, సారె వితరణ చేస్తున్న దృశ్యం

అడ్డతీగల: మండల కేంద్రంలోని పవనగిరి క్షేత్రం నుంచి మూడు గ్రామాలకు గంగాలమ్మ తల్లి పుట్టింటి చీర, సారెను భక్తులకు బుధవారం వితరణ చేశారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య సతీమణి విజయలక్ష్మి ఈ మేరకు అడ్డతీగల మండలం దొరమామిడి, రాజవొమ్మంగి మండలం బోనెంపాలెం, గొబ్బిలమడుగు గ్రామాల్లో గంగాలమ్మ జాతర నిర్వహణకు అవసరమైన పుట్టింటి చీర, సారె, పూజా సామగ్రి, ఘటాలను అందజేశారు. అంతకుముందు ఆయా గ్రామాల గిరిజనులచే క్షేత్రంలో కొలువైన గంగాలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధి పనులు వేగవంతం



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతయ్య

చింతపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో లాలం సీతయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. జాబ్ కార్డులు లేని వారి వివరాలు అయనకు అందజేయాలన్నారు. వేతనదారుల ఆధార్‌కార్డును బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయాలని ఆదేశించారు. ప్రతి జాబ్‌కార్డుదారుడికి ఉపాధి పనుల్లో పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. ఏపీవో కొండబాబు, ఈసీ సంజీవ్, టెక్నికల్ అస్టెంట్‌లు, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణకు వినతి

చింతూరు: స్థానిక జీసీసీలో జరగుతున్న అవినీతిపై విచారణ జరపాలని బీజేపీ నాయకులు ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరేకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జీసీసీ ద్వారా పాఠశాలలకు, వరద బాధితులకు ఇవ్వాల్సిన బియ్యం, నిత్యావసర సరకులను కొంతమంది ఉద్యోగులు అమ్ముకుంటూ అవినీతికి పాల్పడుతున్నట్టు ఆరోపించారు. దీనిపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు. వెంకయ్య, రమణారెడ్డి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత ఆనందం



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తదితరులు

- రాయితీపై విత్తనాల సరఫరా
- గిరిజన రైతులకు తీరిన కష్టాలు

చింతపల్లిరూరల్: ఏళ్ల తరబడి విత్తనాల కోసం గిరిజన రైతులు నానా అవస్థలు పడ్డారు. పొరుగు రాష్ట్రం ఒడిశా వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది... దీంతో పాటు నకిలీ విత్తనాల బెడద వెంటాడేది. ఆరుగాలం శ్రమించాక నకిలీ విత్తనాల వల్ల పంట దిగుబడి రాక గిరిజన రైతు చాలా కష్టాలు పడాల్సి వచ్చేది.. రైతులకు అప్పులు మిగిలేవి... శ్రమ వృథాగా అయ్యేది...నకిలీ విత్తనాలు, పురుగు మందుల బెడదతో ఏళ్ల తరబడి గిరిజన రైతులు పడిన కష్టాలు వర్ణనాతీతం...గత టీడీపీ హయాంలో పాలకులు వ్యవసాయ రంగాన్ని కనీసం పట్టించుకోలేదు. ఫలితంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదంతా గతం... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయానికి పెద్దపీట వేసింది. వ్యవసాయాన్ని పండగగా మార్చింది. అన్నదాత కోసం వైఎస్సార్ రైతు భరోసాతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమల్లోకి తీసుకొచ్చింది. రైతు భరోసా కేంద్రాలను(ఆర్‌బీకే) ఏర్పాటుచేసి అన్నదాతకు అవసరమైన సాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. దీంతో నకిలీ విత్తనాల బెడద నుంచి కాపాడేందుకు ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ పనిముట్లు సరఫరా చేస్తోంది. దీంతో పాటు దిగుబడి అయిన పంట కొనుగోలుకు చర్యలు తీసుకుంటోంది. మన్యంలో కొర్రలు, సామలు, రాగులు, సజ్జలు తదితర చిరుధాన్యాల సాగు కోసం గిరిజన రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తోంది.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సాయానికి గిరిజన రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్న సేవలకు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.

మన్యంలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం

మన్యంలో ఎక్కువ మంది వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నారు. విత్తనాల కోసం పొరుగు రాష్ట్రమైన ఒడిశా వెళ్లాల్సి వచ్చేది. విత్తనాల కొరత మాత్రం గిరిజనులకు పెద్ద సమస్యగా ఉండేది. వారపు సంతల్లో కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయించడంతో వాటి వల్ల రైతులు నష్టపోతుండేవారు. ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రైతులకు విత్తనాలను 90 శాతం రాయితీపై పంపిణీ చేస్తుంది. ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, పురుగుల మందులు కుడా పంపిణీ చేస్తుంది. దీంతో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన బాధ తప్పింది. నకిలీ విత్తనాలు, పురుగుల మందులు కొని మోసపోతున్న వారిని ఆదుకునేందుకు ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం రైతులకు విత్తనాలు సరఫరా చేస్తోంది. ఫలితంగా మన్యంలో గతంలో కంటె అధిక విస్తీర్ణంలో ప్రస్తుతం విస్తారంగా పంటలు పండిస్తున్నారు. చిరుధాన్యాలతో పాటు ఉద్యానవన పంటలు, కూరగాయలు, ఆకుకూరల సాగు బాగుంది. గిరిజన రైతులు పండించిన పంటలను సమీప వారపు సంతల్లో విక్రయిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా వరితో పాటు రాగులు, సజ్జలు, కొర్రలు, వేరుశనగ, రాజ్‌మా తదితర పంటల విత్తనాలను 90 శాతం రాయితీపై సరఫరా చేస్తోంది. ఇందుకోసం రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుతో సమీపంలోని ఆర్‌బీకే కేంద్రంలో సిబ్బందికి సంప్రదిస్తే.. రాయితీపై విత్తనాలతో పాటు వ్యవసాయ పనిముట్లు కూడా పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.

రైతులకు మేలు



రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశానుసారం 90 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నాం. క్రిమి సంహారక మందులు కుడా సరఫరా చేస్తున్నాం. రైతులకు అవసరమైన మేరకు ఇండెంట్ ద్వారా వాటిని అందచేస్తున్నాం.

– కంటా జాహ్నవి, ఏడీఏ, చింతపల్లి

నాణ్యమైన విత్తనాలు



ఇప్పటి వరకు విత్తనాల కోసం ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేది. సంతల్లో నకిలీ విత్తనాలు కొని మోసపోయేవాళ్లం. ప్రస్తుతం ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు పంపిణీ చేస్తోంది. రాయితీ కుడా ఇచ్చి రైతులను ప్రభుత్వం ఆదుకుని మేలు చేయడం చాలా ఆనందంగా ఉంది.

– అబ్బాయినాయుడు, రైతు, గొందిపాకలు

ఐటీడీఏలో ఫ్యాన్లు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

చింతూరు: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని 'స్పందన' కార్యక్రమానికి దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చే ప్రజల కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక గదిలో అధికారులు ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో పలు సమస్యలపై వినతులు ఇచ్చేందుకు వచ్చే ప్రజల కోసం ప్రత్యేక గదిని ఏర్పాటుచేశారు. ఇక్కడ ఫ్యాన్లు లేకపోవడంతో అర్జీదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యపై ఈనెల 11న 'సాక్షి'లో 'ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి' శీర్షికతో కథనం ప్రచురితమైంది.దీనిపై అధికారులు స్పందించారు. ప్రజలు అర్జీలు అందజేసే గదిలో ఫ్యాన్లు ఏర్పాటు చేయించారు. దీంతో పాటు ఐటీడీఏ పీవో ఛాంబర్ ఎదుట పాడైన ఫ్యాన్‌ను తొలగించి, కొత్తది ఏర్పాటు చేశారు. ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సౌకర్యం కూడా కలిగించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఐటీడీఏలో ఏర్పాటు చేసిన ఫ్యాన్లు

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



వెదురునగరంలో గ్రామస్తులకు ఆరోగ్య భద్రతపై సూచనలిస్తున్న వైద్యాధికారి స్పందన

అడ్డతీగల: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని దుప్పులపాలెం వైద్యాధికారి ఎం.స్పందన అన్నారు. మండలంలోని వెదురునగరంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య సేవలందించారు. అనంతరం డాక్టర్ స్పందన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమల నివారణలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీటి నిల్వ లేకుండా చూడాలని, దోమతెరలు వినియోగించాలని సూచించారు. వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంపీహెచ్ఈఓ వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు దివ్య, పరిమళ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ల సంక్షేమానికి కృషి

రాజవొమ్మంగి: మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం స్థానిక జకర్యా ప్రార్థన మందిరంలో జరిగింది. సంఘం అధ్యక్షుడిగా పూజల బాబూరావు, ఉపాధ్యక్షుడిగా అబ్రహాం, కార్యదర్శిగా తిమోతి, జాయింట్ సెక్రటరీగా శామ్యూల్ తదితరులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ స్టీఫెన్, జిల్లా అధ్యక్షుడు తిమోతి, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు మణికుమార్, హైకోర్ట్ అడ్వకేట్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాస్టర్ల సంక్షేమం కోసం సంఘం తరఫున కృషి చేస్తామన్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన బాబూరావును ఘనంగా సన్మానించారు.



మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబూరావును సన్మానిస్తున్న క్రైస్తవులు

123 మందికి వైద్య పరీక్షలు

రంపచోడవరం: మండల కేంద్రంలోని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం ఆవరణలో డెల్టా ఆస్పత్రి, రాజమండ్రి ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత కామేశ్వరి ప్రారంభించారు. డెల్టా ఆస్పత్రి చేపడుతున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా డెల్టా ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ క్రాంతికుమార్, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్ పట్నాయక్ మాట్లాడుతూ శిబిరంలో 123 మంది రోగులు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సౌమ్య, పీఎం జన ఔషధ స్టేట్ నోడల్ అధికారి హరికృష్ణ, సిబ్బంది మోహన్, కాశీ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న పందిరిమామిడి కేవీకే ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత

రైతులకు మొక్కల పంపిణీ

మునగపాక : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాస రావు తెలిపారు. ఎస్‌బీఐ గ్రామసేవా కేంద్రం ఆధ్వర్యంలో సమకూర్చిన మొక్కలను ఆయన బుధవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కల పెంపకంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ప్రతినిధులు నవీన్, భారతి, రైతులు రాము, వాసు, శరగడం అప్పలనాయుడు పాల్గొన్నారు.



మొక్కలు అందజేస్తున్న దృశ్యం

నేటి నుంచి పోతురాజు బాబు జాతర

చింతపల్లిరూరల్: మండలంలో తాజంగిలో గురువారం నుంచి 21వ తేదీ వరకు పోతురాజు బాబు జాతర నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీ ఏడాది మాదిరిగానే భారీ స్థాయిలో పోతురాజుబాబు జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. జాతర ముగింపు రోజున భారీ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్యురాలు

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆర్.వి.నగర్ డాక్టర్ సౌమ్య బుధవారం సందర్శించారు.చిన్నారులకు టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. తమ సిబ్బంది వచ్చి చిన్నారులకు టీకాలు, గర్భిణులకు ఐరన్ మాత్రలు సరఫరా చేస్తారని వాటికి క్రమం తప్పకుండా వాడాలని కోరారు. ఏఎన్ఎం కుమారి, అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి తదితరులున్నారు.

పంచాయతీల విలీన సమస్యపై తెలంగాణ గవర్నర్‌కు వినతి

ఎటపాక: ఆంధ్రాలో విలీనం చేసిన ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణాలో కలపాలని కోరుతూ బుధవారం భద్రాచలం వచ్చిన తెలంగాణ గవర్నర్ తమిళిసైకి పలువురు వినతిపత్రం అందజేశారు. గిరిజనులతో గవర్నర్ సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అయితే ఎటపాక మండలం పరిధిలోని రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉన్న గుండాల, పురుషోత్తపట్టణం, కన్నాయిగూడెం, పిచుకలపాడు, ఎటపాక గ్రామ పంచాయతీలకు చెందిన పలువురు గవర్నర్‌ని కలిశారు. రాష్ట్ర విభజన తరువాత తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రస్తుతం జిల్లా కేంద్రం పాడేరు వెళ్లేందుకు 450 కిలోమీటర్లు ప్రయాణించాలని, డివిజన్ కేంద్రం కూడా దూరాభారంగా మారిందని వివరించారు. అన్ని సౌకర్యాలు ఉన్న భద్రాచలం అందుబాటులో ఉన్నందున ఐదు పంచాయతీలను తెలంగాణాలో కలిపేలా కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

సహకార సంఘం బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఎన్నిక

నర్సీపట్నం: మండల స్థాయి రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఎన్నిక స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం జరిగింది. ఏపీఎం ఎస్.పార్వతీబాయి ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో 15 మందిని డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. వీరిలో ఐదుగురిని పాలకవర్గం సభ్యులు ఎన్నుకున్నారని ఏపీఎం తెలిపారు.

అనంతరం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో భాగంగా రైతు ఉత్పత్తి సంఘాల ఉద్దేశం, చేయు కార్యక్రమాలు గురించి ఏపీఎం వివరించారు. మండల సమాఖ్య సభ్యులు, అధ్యక్షులు, సీసీ రాజశేఖర్, రామలక్ష్మి, బి.జగదీష్ పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమమే ధ్యేయం



లక్ష్మీపురంలో స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గంగవరం : ప్రజలకు ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని మోహనాపురం సచివాలయం పరిధిలో బుధవారం లక్ష్మీపురం, శరభవరం, నూగుమామిడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె రాత్రి 8 గంటల వరకు ఆయా గ్రామాల్లో పర్యటించి 175 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు, పరిపాలన విధానాలపై ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే ధనలక్ష్మి దృష్టికి తీసుకువచ్చారు. లక్ష్మీపురం గ్రామంలో తాగునీటి సమస్య ఉందని గిరిజన మహిళలు ఎమ్మెల్యేకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రం లేక ఇబ్బందులు పడుతున్నామని లక్ష్మీపురంలో సెంటర్ ఏర్పాటు చేయాలని మహిళలు కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి ఐసీడీఎస్ అధికారులతో చర్చించి మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శరభవరం– నూగుమామిడి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు గడప గడపకు మన ప్రభుత్వం నిధులను వినియోగిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఎమ్మెల్యేకు గిరిజన మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి , జెడ్పీటీసీ బేబి రత్నం, వైస్ ఎంపీపీలు కె.రామతులసి, కుంజం గంగాదేవి, ఎంపీటీసీ మడ్డీటీ వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు కురసం అక్కమ్మ, వెంకటేశ్వర్లుదొర, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ పండా సిద్దార్థదొర, ఎంపీడీఓ బి.శ్రీనివాసులు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు శారపు పావని, ఆర్ఐ ఫయాజ్ బాషా, సచివాలయ కార్యదర్శి చంద్రశేఖర్, వీఆర్వో అప్పలకొండ, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు, వైఎస్సార్ సీపీ నాయకులు రామకృష్ణ, వీరబాబు, అడ్డపల్లి బాబి, రాంబాబు, జడేరు రమణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గిరిజన గ్రామాలు



చవిటిదిబ్బలులో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు గ్రామం నుంచి కణతలబంద గ్రామం మీదుగా బండిగడ్డ గ్రామానికి బీటీరోడ్డు నిర్మాణానికి బుధవారం ప్రజా ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబుల సూచన మేరకు ఎంపీపీ కడబాల ఆనందరావు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ బచ్చలి చిన్నమ్ములు పాల్గొని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆనందరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబుల కృషి ఫలితంగా బీటీరోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. మండల పార్టీ కన్వీనర్ మామిడి అప్పారావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు జి.త్రిమూర్తులు, కె.కనకరాజు, బి.రమేష్, ఎం.భారతిబాబు, ఎం.బాబి, ఎం.నారాయణరావు, కె.విజయకుమార్, బి.నూకరాజు, వి.సత్తిబాబు, వి.మాధవ, పి.తమ్మిరెడ్డి పాల్గొన్నారు.



పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ రమేష్ తదితరులు

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెంలో రూ.6.5లక్షల ఎంపీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ బడుగు రమేష్ బుధవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అదే విధంగా గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎప్పట్నుంచో శ్మశానానికి రోడ్డు లేకపోవడంతో మృతదేహాలను తరలించేందుకు చాలా అవస్థలు పడేవారన్నారు. ఇప్పుడు రోడ్డు వేస్తే ఇబ్బందులు తొలగుతాయన్నారు. మండల ఉపాధ్యక్షురాలు అంబటి నూకాలు, సర్పంచ్ పీటీ సింహాచలం, నాయకులు కృష్ణ, ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

ప్రజావసరాల పనులకు ప్రాధాన్యం



జి.మాడుగులలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖరరావు

జి.మాడుగుల: ప్రజావసరాల పనులకుప్రాధాన్యమివ్వాలని ఎంపీడీవో చంద్రశేఖరరావు సూచించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజావసర సర్టిఫికేట్లు, నాడు–నేడు పనుల పురోగతి, జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ తదితర పనులపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చి వినతులు, దరఖాస్తులపై విచారణ చేపట్టి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జి.మాడుగుల–2 గ్రామ సచివాలయం ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వ సూచనల మేరకు ఐదు రిజిష్టర్ల పక్కాగా నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ఈవోపీఆర్డీ నాయుడు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: గ్రామ సచివాలయాల వారీగా ప్రభుత్వం పాఠశాలలకు పంపిణీ చేస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లను సరఫరా చేయాలని ఇందు కోసం ప్రతి సచివాలయం పరిధిలోనూ ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్టు గూడెంకొత్తవీధి ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యాకానుక కిట్ల కోసం ఉపాధ్యాయులు మండల కేంద్రాలకు రానవసరం లేదన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన సామగ్రిని సచివాలయ ఉద్యోగులతో నియమించిన కమిటీ సభ్యులు, వెలుగు అధికారులతో కలసి ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తారన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఉపాధి పథకం ద్వారా 90 రోజుల పనిదినాలకు సంబంధించి అంచనాలు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ , డిజిటల్ అసిస్టెంట్లకు ఆదేశించారు. ఎంఈఓ, వెలుగు ఏపీఎం, ఉపాధి ఏపీఎం, హౌసింగ్ ఏఈ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీకే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

కొయ్యూరు: ఉపాధ్యాయులు జగనన్న విద్యా కానుక(జేవీకె) కిట్లను తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని ఎంఈవో బోడంనాయుడు కోరారు. దీనికి సంబంధించి ఆయన బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు చేపట్టాల్సిన చర్యలను సూచించారు. ఏపీఎం శ్రీనివాస్ పలు సూచనలు చేశారు.

నేడు రాజేంద్రపాలెంలో గడప గడపకు

కొయ్యూరు: రాజేంద్రపాలెంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మేరీ రోజ్ బుధవారం తెలిపారు. కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పాల్గొంటారని, మధ్యాహ్నం 3గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొవాలని కోరారు.